ఆదాయం పెంచుతాం... పేదలకు పంచుతాం

- పారదర్శక పాలసీలతో ప్రణాళికాబద్ధ అభివృద్ధి
- క్యూర్, ప్యూర్, రేర్ సమ్మిళతమే విజన్ డాక్యుమెంట్
- తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వామ్యం చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారదర్శక పాలసీలతో ప్రణాళికాబద్ధ అభివృద్ధి సాధిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదాయం పెంచి పేదలకు పంచటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ౼త అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్1 నుంచి 13 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వివరాలను సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం సచివాలయంలో మంత్రులతో కలిసి మీడియాకు వివరించారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అద్భుత పాలసీని జాతికి అంకితం చేస్తున్నట్టు చెప్పారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకునేందుకు విజన్ డాక్యుమెంట్ తయారు చేసినట్టు పేర్కొన్నారు.

"విజన్ డాక్యుమెంట్ 2047లో విజన్, స్ట్రాటజీ.. రెండు ప్రధాన అంశాలు. ప్రణాళికాబద్ధమైన

అభివృద్ధికి పారదర్శక పాలసీలు ఉండాలి. పాలసీలకు పెరాలసిస్ వస్తే పెట్టుబడులకు రక్షణ లేకుండా పోతుంది. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ సంస్థల సహకారంతోపాటు విజన్ డాక్యుమెంట్ తయారీలో లక్షలాది మందిని భాగస్వాములను చేస్తున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలి. కోర్ అర్బన్ రీజియన్‌ను సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తాం.

ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) , ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్ వరకు పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (పూర్), రీజనల్ రింగ్‌రోడ్ నుంచి తెలంగాణ బోర్డర్ వరకు రూరల్ అగ్రికల్చరల్ ఎకానమీ (రేర్) పాలసీలు తీసుకువస్తున్నాం. ఆదాయం పెంచి.. పేదలకు పంచే విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థను తయారు చేస్తాం. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం. భారత ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ నుంచి 5శాతం అందిస్తున్నాం. దీన్ని 10 శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. బెంగుళూరు - హైదరాబాద్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు, బుల్లెట్ రైళ్ల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తున్నాం. తెలంగాణకు మరో 4 విమానాశ్రయాలు తీసుకొస్తున్నాం. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కేంద్రంతో అంగీకారం కుదిరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తాం" అని సిఎం తెలిపారు.

దేశంలో సరిపడా ఆహారధాన్యాలున్నా ప్రజలకు సమతుల్య ఆహారం అందడంలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా మంత్రులతో కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానపత్రికను సిఎం ఆవిష్కరించారు.

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ దేశంలోనే ప్రత్యేకం

- ప్రారంభానికి సమగ్ర ఏర్పాట్లు
- సిఎం పర్యటన ఏర్పాట్ల సమీక్షలో మంత్రి తుమ్మల
- 2న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ దేశంలోనే ప్రత్యేకత కలిగినదని వ్యవసాయ, సహకార మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండలంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ఈ నెల 2న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఆ ఏర్పాట్లను ఆదివారం మంత్రి పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణాన్ని పర్యవేక్షించి, పనుల పురోగతిని తెలుసుకున్నారు. సభాస్థలాన్ని సందర్శించారు. తరువాత యూనివర్సిటీ ఆడిటోరియంలో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచే విధంగా దేశంలోనే ప్రత్యేకత కలిగిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గతంలో సింగరేణి నిర్వహించిన 'స్కూల్ ఆఫ్ మైన్స్' అనుభవాన్ని గుర్తుచేస్తూ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ స్థాపనకు చేసిన కృషి గురించి వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక యూనివర్సిటీ అవసరాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి వెంటనే ఆమోదం తెలపడంతో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని చెప్పారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచనలతో రూపొందించిన ప్రతిపాదనను ప్రభుత్వం నిపుణులతో పరిశీలించి, అసెంబ్లీలో ప్రకటించిందని మంత్రి వివరించారు. కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ సంపద లభ్యమయ్యే ప్రాంతంగా ఉండటంతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అత్యుత్తమ ప్రదేశమైందని తెలిపారు. దేశ ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడై పదేండ్లు ప్రధానిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలను గౌరవిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, మంత్రివర్గం, అసెంబ్లీ దీనిని ఆమోదించాయని వివరించారు.పాల్వంచలో గడువు పూర్తయిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను తొలగించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి సిఎం ఆమోదం తెలిపినట్టు తెలిపారు. కొత్తగూడెం బైపాస్ రహదారి కోసం రూ.420 కోట్లతో జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన రూ.3400 కోట్ల నిధులకు ముఖ్యమంత్రి ఆమోదించినట్టు వెల్లడించారు. భద్రాచలం - మణుగూరు - ఏటూరునాగారం - చౌటాల రహదారి నిర్మాణం కోసం అటవీ శాఖ రెండు లైన్ల రహదారికి అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఖమ్మం కేంద్రంగా సూర్యాపేట - రాజమహేంద్రవరం - నాగపూర్ - అమరావతి రహదారులు పూర్తి కానున్నాయన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజు, ఐటిడిఎ పిఒ రాహుల్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్‌డిఒ మధు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాల వారీగా సంబరాలు

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లైన సందర్భంగా డిసెంబర్ ఒకటి నుంచి జిల్లాల వారీగా సంబురాలు ప్రారంభమవుతాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో జిల్లాల వారీగా జరిగే సంబురాలు వివరాలను వెల్లడించారు. సోమవారం నుంచి ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి నాలుగు గంటల వరకు ప్రతి రోజు ఒక ఉమ్మడి జిల్లాలో జరుగుతాయని తెలిపారు. 1వ తేదీన మక్తల్, 2న కొత్తగూడెం, 3న హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న దేవరకొండ సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 7న ఉస్మానియాలో సంబురాలు నిర్వహించి అభివద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారు. 8న గ్లోబల్ సమ్మిట్ లో రెండేళ్ల పాటు ప్రజల కోసం ఏం చేశామో వివరిస్తామనీ, 9న తెలంగాణ భవిష్యత్తు ప్రణాళిక విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తామని తెలిపారు. ఆ తర్వాత 10, 11, 12 తేదీల్లో కూడా డాక్యుమెంట్‌తో పాటు వివిధ స్టాల్స్‌ను ప్రజలందరూ చూసేందుకు అవకాశం కల్పించనున్నట్టు భట్టి తెలిపారు. ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు లియోనల్ మెస్సీ 13న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతారనీ, తెలంగాణ విజన్‌ను అక్కడ ఆవిష్కరిస్తామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భారీ కసరత్తు తర్వాత విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించుకోబోతున్నామని తెలిపారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు, వివిధ రంగాల నిపుణులు, మేధావులతో 70 సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. నిటిఅయోగ్ డాక్యుమెంట్ నుంచి సలహాలు, సూచనలు స్వీకరించినట్టు వెల్లడించారు. ప్రజాభిప్రాయాలను సలహాలను, సూచనలను ఆహ్వానించగా రాష్ట్ర జనాభాలో ఒక శాతం అంటే నాలుగు లక్షల మంది స్పందించినట్టు తెలిపారు. వీటన్నింటిని క్రోఢీకరించి సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు.

మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఇ పార్కులు

- ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు
- 'ఉమెన్ ఎంపవర్‌మెంట్' ఇంటి నుంచే మొదలు..
- 'వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'లో మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 'వీ హబ్' ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన 'వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్ వేడుక'లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యసాధనలో మహిళలను కీలక భాగస్వామ్యం చేస్తామన్నారు. మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు అనేది ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. ఇప్పుడిప్పుడే సమాజంలో ప్రగతిశీల మార్పు కనిపిస్తోందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామని చెప్పారు. 2017-18 నుంచి 2023-24 మధ్య కాలంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం 22 శాతం నుంచి 40.3 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో మహిళా శ్రామికశక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం రాష్ట్ర పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. మహిళలు కూడా పురుషులకు దీటుగా వ్యాపారాలు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించగలరని 'వీ హబ్' నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే స్టార్టప్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో ఎంటర్ ప్రైజెస్‌గా మార్చేలా 'వీ హబ్ 2.0'కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ వేదిక ద్వారా ఒకేచోట స్కిల్స్, టెక్నాలజీ, ఫైనాన్స్, మార్కెట్, మెంటార్షిప్ అందుబాటులో ఉండేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తామన్నారు. మహిళల ఆలోచన తీరులోనూ మార్పు రావాలని, ఉద్యోగాల కోసం కాకుండా వాటిని సృష్టించేలా కొత్తగా ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రీడాకారిణి గుప్తా జ్వాల, ఫిలిం ప్రొడ్యూసర్ ప్రియాంక దత్, వీ హబ్ సిఇఒ సీతా పల్లచోల్ల తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్‌హాల్(వర్దెల్లి బుచ్చిరాములు నగర్)లో మూడ్రోజులపాటు జరిగిన తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా 19 మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌తోపాటు 105 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా ఎంవి.రమణ, ప్రధాన కార్యదర్శిగా బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎల్లూరి గోవింద్, బోలగాని జయరాములు, గౌని వెంకన్న, బాలే వెంకట మల్లయ్య, ఉషగాని వెంకట నరసయ్య, గౌనిసాంబయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా ఎస్.రమేష్‌గౌడ్, బండ కింది అరుణ్‌గౌడ్, బూడిద గోపి, చౌగాని సీతారాములు, ఎస్.వెంకట్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్, యమగాని వెంకన్న, సహాయ కార్యదర్శులుగా మడ్డి అంజిబాబు, కొండం కరుణాకర్, రాగిరి కృష్ణయ్య (మరొక కోఆప్షన్)ను ఎన్నుకున్నారు.

రెండు లోపు నివేదిక సమర్పించాలి

- విజన్ డాక్యుమెంట్ పై అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్- 2047 పాలసీ డాక్యుమెంట్‌కు సంబంధించిన నివేదికను ఈ నెల 2వ తేదీ రాత్రి వరకు సమర్పించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో ఆయన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను మంత్రులు, సంబంధిత విభాగాల అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రతి అంశాన్ని చర్చించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. 3, 4 తేదీల్లో అన్ని శాఖలు సమర్పించిన నివేదికలను సిఎస్, స్పెషల్ సీఎస్, సీఎంవో అధికారులు పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులను చేసి తుది ప్రతి సిద్ధం చేయాలని కోరారు. 6వ తేదీ సాయంత్రం వరకు తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం కావాలనీ, అందుకోసం అన్ని విభాగాల అధికారులు తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం పూర్తి సమయం కేటాయించాలని ఆయన ఆదేశించారు. గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులకు సూచించారు.

మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

బ్రహ్మయ్య మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- గాండ్లగూడలో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు జిల్లా నాయకులు బ్రహ్మయ్య మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. పెండ్యాల బ్రహ్మయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని గాండ్లగూడలో ఆదివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు బ్రహ్మయ్య మృతదేహంపై పార్టీ నాయకులతో కలిసి జాన్‌వెస్లీ ఎర్రజెండా కప్పి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రహ్మయ్య అంతిమయాత్ర గాండ్లగూడ నుంచి యాచారం అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ఆయనను కడసారి చూసేందుకు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ, ఆటో కార్మికులు, ఇతర పార్టీల నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. బ్రహ్మయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పార్టీకి పరిచయమై అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. పార్టీ యాచారం మండల కార్యదర్శిగా, సిఐటియు మండల కన్వీనర్‌గా పనిచేస్తూ కార్మికుల సమస్యలపై పోరాడారని చెప్పారు. అలాంటి నాయకుడి అకాల మరణం కార్మిక ఉద్యమానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. పార్టీలో, సీఐటీయూ ఉద్యమంలో కామ్రేడ్ బ్రహ్మయ్య అందించిన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పాడె మోసిన జాన్‌వెస్లీ

జాన్‌వెస్లీ, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు బ్రహ్మయ్య పాడె మోశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, సీనియర్ నాయకులు పెసరికాయల జంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, చంద్రమోహన్, డి.రామచందర్, కందుకూరి జగన్, డి.జగదీష్, కవిత, ఈ.నరసింహ, మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య, కీసర నర్సిరెడ్డి, శోభన్, శ్రీనివాస్‌రెడ్డి, రావుల జంగయ్య,సీనియర్‌నాయకులు బి.మధుసూదన్‌రెడ్డి, లాయర్ అరుణ్ కుమార్, సీపీఐ రాష్ట్ర నాయకులు రవీంద్రచారి, ఓ.యాదయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు,మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

కార్మికులకు మోసాలు... కార్పొరేట్లకు లాభాలు

- మోడీ సర్కారు చేస్తున్నది ఇదే
- పోరాటమే శరణ్యం : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మోడీ సర్కారు కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక వర్గానికి తీవ్ర మోసం చేస్తున్నదని, తాము ఎన్నికల్లో గెలవడానికి సహకరిస్తున్న కార్పొరేట్లకు అండగా ఉంటామని మోడీ బహిరంగంగా చెబుతున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డుల యూనియన్ రాష్ట్ర మూడో మహాసభ ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఇటీవల మరణించిన ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్ కుమారస్వామికి మహాసభ నివాళి అర్పించింది. మహాసభనుద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ...వ్యవసాయ మార్కెట్ల సెక్యూరిటీ గార్డుల పట్ల గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దుర్మార్గంగా వహించిందనీ, తెలంగాణ వస్తే కార్మికుల బతుకులు బాగుపడుతాయనుకుంటే మరింత రోడ్డున పడ్డాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా సెక్యూరిటీ గార్డుల వేతనాల పెంపునకు సంబంధించిన జిఒలను మాత్రం విడుదల చేయకుండా తొక్కిపెట్టిందని విమర్శించారు.

ఏడేండ్లకోసారి కూడా సెక్యూరిటీగార్డులకు వేతనాలు పెంచకపోతే ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నాయన్నారు. పర్మినెంట్ ఉద్యోగాలు వద్దు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీవేజ్ ఉద్యోగాలుండాలని కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం దుర్మార్గమన్నారు. మోడీ సర్కారు ప్రపంచబ్యాంకు విధానాలను, కార్పొరేట్ల అనుకూల విధానాలను వేగంగా అమలు చేస్తున్న తీరును వివరించారు. కార్మికులను అణచివేసే కొద్దీ ప్రతిఘటన తీవ్రత పెరుగుతుందని హెచ్చరించారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో మాదిరిగానే ప్రజలు తిరగబడి మోడీ సర్కార్‌కు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. జనవరి 15 తర్వాత లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించబోతున్నామని తెలిపారు.

కేంద్రం విధానాలను నిరసిస్తూ కార్మికులంతా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ గార్డుల పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సోమన్న మాట్లాడుతూ..గతంలో సెక్యూరిటీ సర్వీసెస్ జీవో జారీ చేయడం వల్ల కనీస వేతనాలు వీడీఏను సెక్యూరిటీగార్డులు పొందారని గుర్తుచేశారు. ప్రస్తుతం జీవో నెంబర్ 60 ద్వారా రూ.15,600 వేతనం మాత్రమే ఇవ్వడం ద్వారా కుటుంబాల పోషణ కష్టంగా మారిందని వాపోయారు. 2021లో కార్మిక శాఖ సెక్యూరిటీ సర్వీసెస్ కనీస వేతనాల జీవోను జారీ చేయగా...యాజమాన్యాలు ఒత్తిడి తేవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని ఆపి కార్మికుల పొట్టగొట్టిందనీ, ఉన్న వేతనాన్ని తగ్గిస్తూ రూ.11,952గా నిర్ణయించడం దారుణమని విమర్శించారు. ఆ జీవో వచ్చి ఉంటే వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే సెక్యూరిటీగార్డులకు కనీస వేతనం రూ. 27,434గా ఉండేదని గుర్తుచేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి మార్కెట్ కమిటీల ద్వారానే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ల సెక్యూరిటీ గార్డుల హక్కుల కోసం, వేతనాల పెంపు కోసం పోరాటాలను తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. ఈ మహాసభలో ఆ యూనియన్ కోశాధికారి జనార్ధన్ సంతాప తీర్మానాన్ని ప్రకటించారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ వ్యవసాయ మార్కెట్ల సెక్యూరిటీ గార్డుల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, ఉపాధ్యక్షులు రామన్న, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే తరిమికొడతాం

- కార్మికుల శ్రమను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే..
- ఐక్యంగా ఉద్యమించాలి : వీరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లేబర్‌కోడ్‌లను రద్దు చేయకపోతే కార్మిక ఐక్యతతో కేంద్ర ప్రభుత్వాన్ని తరిమికొడతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య అన్నారు. మెదక్ జిల్లా రామచంద్రాపురంలోని భెల్ టౌన్‌షిప్‌లో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మిక వర్గాన్ని బానిసలుగా చేసేలా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచితీరుతామన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికవర్గం సంఘటితంగా పోరాటాలు చేయాలని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గం పొట్టకొట్టేలా కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికవర్గం యాజమాన్యానికి కట్టు బానిసలుగా మారాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కును కాదనడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కార్మికులు యూనియన్ పెట్టుకోకుండా.. జీతభత్యాల కోసం, సదుపాయాల కోసం బేరసారాలు ఆడకుండా చేయడం అంటే అది పెట్టుబడిదారుల లాభాలను కాపాడటం తప్ప మరోటి కాదన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక లోకం లేబర్ కోడ్‌ల రద్దు కోసం సమ్మె చేస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్, బీఎంఎస్ లాంటి సంస్థలు, సంఘాలు మాత్రం రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. బీఎంఎస్ పాలక వర్గాలకు తొత్తుగా మారి కార్మికవర్గానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలపై పోరాడి మోడీ మెడలు వంచిన ఫలితంగానే అప్పుడు వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. రాబోయే కాలంలో మరింత సమరశీలంగా పోరాడటం ద్వారానే లేబర్ కోడ్‌లను రద్దు చేసుకోగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కె.రాజయ్య, భెల్ నాయకులు పెంటయ్య, నాగులు, భాష, శ్రీనివాస్, రమేశ్ , ప్రభాకర్, వీరన్ రావు పాల్గొన్నారు.

'జల్‌జీవన్' గ్రాంట్లు కేంద్రం నిలిపివేత

- 8 నెలలుగా వేతనాలు లేని 'మిషన్ భగీరథ' సిబ్బంది
- శాఖకు అవార్డులు వచ్చినా తీరని ఉద్యోగుల కష్టాలు
- కనీస వేతనాలు అమలుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలంటున్న సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జల్ జీవన్ మిషన్ (జెజెఎం) గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకంలో ఔట్‌సోర్సింగ్‌పై నియమితులైన 352 మంది సిబ్బందికి 8 నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దాంతో ఆ సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నీటి నాణ్యతా విషయంలో బాగా పనిచేసినందుకు తెలంగాణ రాష్ట్రానికి అవార్డు వచ్చింది. ఇంత చేసినా సిబ్బందికి మాత్రం వేతనాలు ఇవ్వకుండా కేంద్రం తాత్సారం చేస్తోంది. గతంలో నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రామ్ (ఎన్‌ఆర్‌డిడబ్ల్యుపి) కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, వంటలు, ఇతర సౌకర్యార్థం సురక్షితమైన నీటిని అందించడానికి ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2009లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీటితోపాటు ప్రతి మనిషికి అవసరమైన 55ఎల్‌పీసీడీల నీటిని అందించాలని నిర్దేశించింది. 2019లో ఈ పథకం స్థానంలో కేంద్రం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద వచ్చే గ్రాంట్లతో మిషన్ భగీరథ పథకం కింద ఏర్పాటు చేసిన తాగునీటి పరీక్షా కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్‌పై వివిధ విభాగాల్లో పనిచేసే 352 మందికి వేతనాలు ఇచ్చేవారు. తాజాగా కేంద్రం జేజేఎం మిషన్ గ్రాంట్‌ను రాష్ట్రానికి నిలిపివేయడంతో సిబ్బందికి వేతనాలు బంద్ అయ్యాయి. దాంతో ఉద్యోగుల జీవనం కష్టంగా మారింది. మిషన్ భగీరథ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 150 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటున్నాయి. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో మొత్తం 352మంది ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్నారు. రాష్ట్రంలో డివిజన్‌స్థాయిలో, జిల్లాస్థాయిలో, సబ్ డివిజన్‌స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పనిచేస్తున్నారు. 76 మంది చొప్పున కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హెల్పర్లు, 20 మంది ల్యాబ్ అసిస్టెంట్లు, 20 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 9 మంది జిల్లా కన్సల్టెంట్లుగా పనిచేస్తున్నారు. 10-20 ఏండ్లుగా ఈ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రీ మాన్‌సూన్, పోస్ట్ మాన్‌సూన్‌లలో ప్రతినెలా 250 నీటి నమూనాలతో రసాయన పరీక్షలను నిర్వహిస్తారు. 50 నమూనాలను మైక్రో బయాలజిస్టులు పరీక్షిస్తారు. ఏడాదికి మొత్తం 3,600 నీటి నమూనాలను సేకరించి భౌతిక, రసాయనిక సూక్ష్మజీవ సంబంధమైన 13 పరీక్షలను పరీక్షించి పరీక్షా ఫలితాలను ప్రతిరోజు నిర్వహిస్తారు. నెలకు 300 నమూనాలకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తుంటారు. అంతేకాకుండా, శుద్ధనీటి నమూనాలను రీచెక్ చేస్తూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నీటి నమూనాలను ఆలం క్వాలిటీ టెస్టులను అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్నారు.

పెండింగ్‌లో రూ.5 కోట్ల వేతనాలు

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్‌పై నియమితులైన 352 మంది సిబ్బందికి 2025 ఏప్రిల్ నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జల్‌జీవన్ మిషన్ గ్రాంట్లను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో వీరి వేతనాలూ నిలిచిపోయాయి. 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం పట్ల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కెమిస్టులు, మైక్రో బయాలజిస్టులకు నెలకు రూ.20 వేలు, ల్యాబ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.19 వేలు, హెల్పర్లకు రూ.15 వేల వేతనాన్ని ఇస్తున్నారు.

తీవ్ర పనిభారం

ఈ సిబ్బంది చేస్తున్న పనులకు అదనంగా పలు పనులను అప్పగించారు. మిషన్ భగీరథ నీటి వాడకంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేలా పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు అవగాహన కలిగిస్తున్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులకు, గ్రామ ప్రజలకు సైతం శుద్ధ నీటిపై అవగాహన పెంచుతున్నారు. వరదల సమయంలో అదనపు విధులు, శ్రీరామ నవమి, మేడారం తదితర జాతరల్లో అదనంగా పని చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేల్లో జీయో ట్యాగింగ్, ఎన్నికల విధులు, కోవిడ్ సమయంలో స్పెషల్ ఆఫీసర్ విధులను సైతం వీరు నిర్వహించడం గమనార్హం. వీరు అదనపు పనిభారంతో విధులను నిర్వహిస్తున్నా, వీరికి పే స్కేల్ వర్తింపు, నెలవారీ వేతనాలు అందడం లేదు.

IN THE COURT OF HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.S.No. 749 of 2025

BETWEEN:
Sultana Begum and others
...Plantiffs
AND
The Tahsildar, Saroornagar Mandal
2. All the Concerned
...Defendants

The General public hereby informed that the Plaintiffs have filed the suit for Declaration to declare the legal heirs of Late **Mohd. Yousuf** who died on 28-06-1999. The case is posted for any claims are objections on 16-12-2025 from any concern. Hence if any person is/are having any claims/objections they may appear before this Hon'ble II Additional Senior Civil Judge, Ranga Reddy District at L.B.Nagar on **16-12-2025** at 10:30 am failing which the matter will be decided on the material available.

(By order of the Court)
Sd/-
YATA BHASKAR
PEEKA RAMAKRISHNA
PENCHALA SURENDER RAO
Advocates
H.No.LIG-97, TSIIC Colony, Post: ECIL, Hyderabad -500062
Cell No. 9849613691/ 9912317626

సామాజిక న్యాయానికి రిజర్వేషన్లు అనివార్యం

- మత ప్రాతిపదికన దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర
- రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని ప్రజల మధ్య అసమానతలు తగ్గి సామాజిక న్యాయం దక్కాలంటే రిజర్వేషన్లు అనివార్యమని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "75 ఏండ్ల భారత రాజ్యాంగం-లౌకికవాదం, సామాజిక న్యాయం" అనే అంశంపై హైకోర్టు సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్ల హక్కులకు రాజ్యాంగంలో రక్షణ ఉందని, అయితే బిసి వర్గాలకు ఎలాంటి రక్షణ లేదని అన్నారు. ఫలితంగా ఇంకా సమాజంలో అసమానతలు తగ్గడంలేదని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలకు సంపూర్ణ సామాజిక న్యాయం దక్కాలంటే రిజర్వేషన్లు ఒక్కటే మార్గం కాదని అన్నారు. రాజ్యాంగం వారికి కల్పించిన అన్ని హక్కులను, చట్టాలను పకడ్బందిగా అమలు చేయాల్సిన అవసరం పాలకులపై ఉందని, అప్పుడే సామాజిక న్యాయం సాధ్యమని చెప్పారు. దేశాన్ని పాలిస్తున్న నియంతలు అనుసరిస్తున్న తీరుతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాల ప్రతాపదికన మనుషులను విడదీసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. న్యాయ వ్యవస్థలు సైతం రాజ్యాంగం పరిధిని దాటి మత విశ్వాసాల ప్రాతిపదికన తీర్పులు ఇస్తున్నాయనే ప్రచారం నిజమైతే అది దేశానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. రాజ్యాంగ పీఠికలో చేర్చిన లౌకిక వాదం, సామాజిక న్యాయం అనే అంశాలను తొలిగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆయన తప్పు పట్టారు. భిన్న మతాలు, భిన్న బాషల సమూహాలు కలిసి మెలిసి జీవిస్తున్న లౌకిక దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పన్నుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి, సిపిఎం సీనియర్ నాయకులు డిజి నర్సింహారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు కామేశ్ బాబు, డిఎస్‌వి ప్రసాద్, కె ఉమామహేశ్వర రావు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, మహిళా, న్యాయవాద, జర్నలిస్టు, గిరిజన సంఘాలకు చెందిన ప్రతినిధులు, పలువురు రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చకు వచ్చిన పలు ప్రశ్నలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిచ్చారు. ఆ వివరాలు....

ప్రశ్న : రాజ్యాంగ పీఠికలోని లౌకిక వాదం, సామాజిక న్యాయం అనే అంశాలను మధ్యలో చేర్చారనే ప్రచారాన్ని ఇటీవల కొంతమంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వాటిని తొలగించేందుకు పాలకులు ఎందుకు ప్రయత్నిస్తున్నారు?

సమాధానం: లౌకక వాదం, సామాజిక న్యాయం కొత్తగా భారత రాజ్యాంగంలో చేర్చలేదు. ఈ అంశాలు ఆరంభం నుంచి చివరి వరకు రాజ్యాంగంలో అంతర్లీనమై ఉన్నాయి. సుదీర్ఘ మేధోమథనం తర్వాత వీటిని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో పొందు పర్చారు. దేశంలో అధికారంలో ఉన్న పాలకులు తమ అజెండాను అమలు చేసే కుట్రలో బాగంగా వాటిని తొలిగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను లౌకిక వాదులు అడ్డుకుంటూనే ఉన్నారు.

ప్రశ్న: రిజర్వేషన్లను 50 శాతానికి మించకూడదని ఇందిరా సహాని కేసులో ఇచ్చిన తీర్పు ఎంత వరకు సమంజసం?

సమాధానం: దేశంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి తదితర బలహీన వర్గాలకు చెందిన వారు 86 శాతానికి పైగా ఉన్నారు. ఏండ్లుగా కొనసాగుతున్న అసమానతలను రూపు మాపాలంటే రిజర్వేషన్ల పరిధి పెరగాల్సిన అవసరం ఉంది. ఇందిరా సహాని కేసులో ఇచ్చిన తీర్పు నా దృష్టిలో సరికాదని భావిస్తున్నాను.

ప్రశ్న: రాష్ట్రంలో జరిగిన కులగణనలో మొదట్లో ఆస్తుల వివరాలు వెల్లడించాలని అన్నారు. ఆ తర్వాత వివిధ వర్గాల నుంచి వచ్చిన ఒత్తిడితో ఆ క్లాజ్‌ను తొలిగించడం సరైనదేదా?

సమాధానం: దాని వల్ల పెద్దగా నష్టం జరుగుతుందని నేనుకోవడం లేదు. ఈ రోజు ఆర్టీఐ ఇతర విధానాలతో అన్ని వివరాలను పొందుతున్నారు. ఇంతకంటే నేను ఎక్కువగా చెప్పలేను. ఇందుకు సంబంధించి ప్రభుత్వం వేసిన కమిటీలో నేను భాగస్వామిగా ఉన్నాను.

ప్రశ్న: బీహార్‌లో జరిగిన కులగణన సరైందేనా? దాని ప్రభావం ప్రజలపై ఏ విధంగా ఉంది?

సమాదానం: బీహార్‌లో జరిగిన కులగణన సరైంది కాదని భావిస్తున్నాను. దాన్ని ఆధారంగా చేసుకుని సర్‌ను అమలు చేస్తున్నారు. మత ప్రాతిపదికన ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారు. ఇది లౌకిక, ప్రజాస్వామ్యానికి ప్రమాదం.

ప్రశ్న: ఇబిసి రిజర్వేషన్లు సరైనవేనా?

సమాధానం: ఇబిసి రిజర్వేషన్లు నా దృష్టిలో సరైనవి కాదు. అన్నింటా అభివృద్ధి చెందిన వారికి కొనసాగించడం వల్ల అట్టడుగు వర్గాలు నష్ట పోతున్నారు. ఓపెన్ కేటగిరిలో సరైన ప్రాతినిద్యం పొందుతున్న వారు ఇంకా రిజర్వేషన్లను పొందడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు

ప్రశ్న: రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రస్తావన ఉంది. కాని మీడియా ప్రస్తావన ఎందుకు లేదు? పౌర స్వేచ్ఛనే మీడియా స్వేచ్ఛ అనే విధానం సరైనదేనా?

సమాధానం: మీడియా అనే కాదు చాలా వర్గాలకు చెందిన ప్రస్తావన రాజ్యాంగంలో లేదు. ఉదాహారణకు రాజకీయ పార్టీలు, నాయకుల ప్రస్తావన లేదు. అంత మాత్రాన వారు తమ హక్కులను పొందలేక పోతున్నారా? మీడియాకు హక్కుల విషయంలో సుప్రీంకోర్టు అనేక సార్లు ప్రస్తావించింది. మీడియా పై ఎలాంటి నియంత్రణ ఉండదని భావిస్తున్నాను. దేశంలోని ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పలువురు ప్రస్తావించారు. ఇప్పటి వరకు జరిగిన రాజ్యాంగ సవరణలను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించాలని పలువురు చేసిన సూచనలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఏకీభవించారు. పౌరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలపై ఆయన సానుకూలంగా స్పందించారు.

జనవరి 3 నుంచి టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి 3 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ను నిర్వహించనున్నారు. ఈ నెల 29తో టెట్ దరఖాస్తులకు గడువు ముగియగా మొత్తం 2,37,754 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇన్ సర్వీస్ టీచర్లు 71,670 మంది ఉండగా, ఇతరులు 1,66,084 మంది ఉన్నారు. పేపర్ 1 కోసం ఇన్‌సర్వీస్ టీచర్లు 27,389 మంది, ఇతరులు 58,149 మంది, పేపర్ 2 కోసం ఇన్‌సర్వీస్ టీచర్లు 44,281 మంది, ఇతరులు 1,07,935 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేశారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలి

- ప్రధాని మోడీ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం రైతు ఉద్యమ స్ఫూర్తితో యావత్ కార్మిక లోకం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం సిఐటియు జిల్లా నాలుగో మహాసభ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కూరపాటి రమేష్ ప్రసంగించారు. బిజెపి-మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం యూనియన్లు పెట్టుకుని పోరాడే హక్కును తొలగించేందుకు ప్రయత్నిస్తూ, యజమానులకు అవకాశం కల్పిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఇది కార్మికుల శ్రమను దోచుకోవడమే అన్నారు. సింగరేణి, ఎల్‌ఐసీ, గనులు, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తోందని విమర్శించారు. మహాసభలో భవిష్యత్ ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. లేబర్ కోడ్‌ల పేరుతో సమ్మె, యూనియన్ పెట్టుకునే హక్కులను తొలగిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ అన్నారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక జీవోలను తీసుకొస్తూ, కార్మిక ఉద్యమాలను అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభలో సిఐటియు పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముషం రమేష్, జానవిజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపకులు సి రామరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు బాబు, నర్సయ్య, ఐద్యా జిల్లా కార్యదర్శి విమల పాల్గొన్నారు.

భారీ ఆస్తి నష్టానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత

- కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కెటిఆర్ తీవ్ర ఆవేదన
- బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అభయాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్ చేసి మాట్లాడిన కెటిఆర్, క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి, ఎంతో కష్టపడి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్రమాదంతో ఒక్కసారిగా రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన చెందారు. షాపుల్లో ఉన్న సరుకు, బొమ్మలు, ఇతర సామాగ్రి సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయని, దాదాపు 30 కుటుంబాల భవిష్యత్తు నాశనమైందని విచారం వ్యక్తం చేశారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి నష్టం జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. సకాలంలో ఫైర్ ఇంజన్లు రాకపోవడమే ఆస్తి నష్టం భారీగా పెరగడానికి ప్రధాన కారణమని కెటిఆర్ మండిపడ్డారు. జగిత్యాల ఫైరింజన్ రిపేర్‌లో ఉండడం, వచ్చిన ఒక ఇంజన్ పని చేయకపోవడం, గంట తర్వాత కోరుట్ల, కరీంనగర్ నుంచి వాహనాలు రావడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సర్వం కోల్పోయిన ఈ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. జరిగిన ఆస్తి నష్టం, పూర్తిగా దెబ్బతిన్న వ్యాపారాన్ని, దుకాణాలు ఏమాత్రం పనికిరాని స్థితికి చేరడాన్ని దృష్టిలో ఉంచుకొని, మానవతా దృక్పథంతో ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలియగానే అక్కడికి చేరుకుని, సహాయక చర్యల్లో పాల్గొని, బాధితులకు తక్షణ సాయంగా రూ. ఐదు వేలు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కెటిఆర్ అభినందించారు. స్థానికులకు, నష్టపోయిన కుటుంబాలకు బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సిఎం శంకుస్థాపనల పర్యటనలు

- ఎన్నికల ప్రచారం కోసమే : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల పేరుతో సిఎం జిల్లాలు పర్యటించడం కేవలం ఎన్నికల ప్రచారం కోసమేనని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేయడం ముమ్మాటికి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని ఆమె అన్నారు. తక్షణమే రాష్ట్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఈ దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో ప్రజలను తరలించి ముఖ్యమంత్రి సందేశం ఇవ్వాలని చూస్తున్నారని ఆమె తెలిపారు. ప్రభుత్వ నిధులను ఉపయోగించి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఆమె విమర్శించారు.

రాయినిగూడెం, చంద్రు తండా సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా ములుగు మండలం రాయినిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఈసం సునీత, ఉపసర్పంచ్‌గా ఏ.దేవేందర్‌రావుతోపాటు ఎనిమిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వార్డు సభ్యులు: కొప్పుల శ్రీను, పాయం సునీత, గోండి పాపయ్య, వజ్జ సరూప, గుడ్డెల్లి అరుణ, చెరుకుల సమ్మయ్య, తవిటి లక్ష్మి. గ్రామాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకొని జిల్లాలోని రాయినిగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాతమని నూతన కమిటీ తెలిపింది. గ్రామపంచాయతీ పాలక మండలి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మంత్రి సీతక్క వారికి అభినందనలు తెలిపారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం చంద్రు తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవితోపాటు వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. సాధారణ రైతు, గ్రామ సమస్యలపై పోరాడిన బానోత్ శీను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామం కోసం నిజాయితీగా పనిచేసే వ్యక్తి కావాలని నిర్ణయించిన గ్రామ పెద్దలు శీనును ఎంపిక చేశారు. వార్డు సభ్యులు ఇస్లావత్ శోభ, లాకావత్ రమేష్, బానోతు లలిత, లాకావత్ శీను (ఉప సర్పంచ్), గుగులోతు బాలు, బుక్యరాజు, బానోతు రజిత, బుక్య సరిత కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ బానోత్ శీను మాట్లాడుతూ.. తాగునీరు, రహదారులు, రైతు సంక్షేమం, విద్యా సదుపాయాల అభివృద్ధి తన ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించారు.

66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసులో సివిల్ జడ్జిల (జూనియర్ డివిజన్) స్థాయిలో 66 పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులకు డిసెంబర్ ఎనిమిది నుంచి 29వ తేదీల మధ్యలో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నోటిఫికేషన్, పరీక్ష తేదీలు, హాల్ టికెట్ల డౌన్‌లోడ్, కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష తదితర వివరాలు హైకోర్టు వెబ్‌సైట్ http://tshc.gov.comలో అందుబాటులో ఉంటాయని ప్రకటించారు.

చెరుకు ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం

- ఈ ఏడాది 25 వేల టన్నులు మాత్రమే గానుగ
- తగ్గిపోయిన చెరుకు దిగుబడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో 2025-26 సీజన్ చెరుకు క్రషింగ్‌ను ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగొండ్ల నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. సీజన్‌కు కేవలం 25 వేల టన్నులు మాత్రమే చెరుకు క్రషింగ్ చేసే అవకాశం ఉందని వైస్ ప్రెసిడెంట్ చల్లగొండ్ల నాగేశ్వరరావు, సివిల్ ఇం.ఇనీర్ రఘునాథ్ బాబు తెలిపారు. చెరుకు మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు వరి సాగు వైపు మొగ్గ చూపడంతో చెరుకు సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. చెరుకు సాగుకు ఏడాదికి టన్నుకు మద్దతు ధర 3,210 రూపాయలు, ఫ్యాక్టరీ 290 రూపాయలు ప్రోత్సాహంగా చెల్లిస్తుందన్నారు. మొత్తం రైతుకి రూ.3500 ఇస్తున్నా గిట్టుబాటు కావట్లేదని వరి పంట సాగు చేస్తున్నారని తెలిపారు.

రైతులకు చెరుకు పంట సాగు చేస్తే విత్తనం కింద రెండు టన్నులు చెరుకు ఫ్రీగా ఇస్తామని, సాగు కోసం రుణాలు ఇస్తామని, ఫెన్సింగ్ వేసుకోవడానికి కూడా రుణాలు ఇస్తామని చెప్పారు. ఈ ఏడాది వారం రోజులు మాత్రమే క్రషింగ్ జరుగుతుందని తెలిపారు. చెరుకు పంట వల్ల నష్టం కంటే లాభమే ఎక్కువగా ఉంటుందని, ప్రకృతి వల్ల సంభవించే నష్టాలు కూడా అధిగమించొచ్చని అన్నారు. రైతులు చెరుకు సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు.

డిస్కౌంట్ కావాలా..? జిఎస్‌టి తగ్గించాలా..?

- మెడికల్ మాఫియా మైండ్‌గేమ్
- పాత ధరలకే మందుల అమ్మకాలు
- తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్న ప్రజలు
- మెడికల్ షాపుల్లో తనిఖీలు చేయని అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణగూడకు చెందిన అన్వేష్ దగ్గరలో ఉన్న ఓ మెడికల్ షాపునకు వెళ్లి మందులు కొన్నాడు. ఇందుకు అతనికి రూ.1,200 బిల్లు అయింది. డిస్కౌంట్ పోను రూ.1,080 ఇవ్వాలని షాపు అతను సూచించాడు. 'ఇప్పుడు మందులపై కూడా ఏడు శాతం జిఎస్‌టి తగ్గింది కదా.. తగ్గించరా..?' అని దుకాణదారున్ని అన్వేష్ ప్రశ్నించారు. 'మీకు ఇప్పటికే 10 శాతం డిస్కౌంట్ ఇచ్చాం కదా.. జిఎస్‌టి కావాలంటే ఆ డిస్కౌంట్ ఉండదు' అని చెప్పాడు. దీంతో డిస్కౌంట్‌తోనే సరిపెట్టుకుని అన్వేష్ వెళ్లిపోయాడు.

ఎల్బీనగర్‌కు చెందిన నర్సింహ్మా స్థానికంగా ఉన్న ఓ మెడికల్ షాపులో మందులు కొన్నాడు. ఈ మేరకు రూ.3,600 బిల్లు అయింది. డిస్కౌంట్ పోను రూ.3,140 చెల్లించాలని షాపు అతను సూచించాడు. బిల్లు కావాలని అడిగితే బిల్లు కావాల్సి వస్తే జిఎస్‌టి ఏడు శాతం మాత్రమే తగ్గింపు ఉంటుందని చెప్పాడు. మూడు శాతం నష్టపోవాల్సి వస్తుందని భావించిన నర్సింహ్మా బిల్లు లేకుండానే మందులు తీసుకెళ్లిపోయాడు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి పలు వస్తువులపై జీఎస్టీ తగ్గిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో మెడికల్ మందులు కూడా ఉన్నాయి. కానీ కొన్ని రకాల వస్తువుల ధరలు మాత్రం తగ్గడం లేదు. తమ వద్ద పాత స్టాక్ ఉందని, జీఎస్టీ తగ్గించి ఇచ్చి మేం నష్టపోవాలా..? అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రంలో దాదాపు 40 వేల వరకు రిటైల్, హెూల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ రూ.కోట్ల వ్యాపారం సాగుతోంది. అయితే ఈ దుకాణాల్లో అధిక శాతం ప్రజలకు జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలాలు అందడం లేదు. గతంలో ఔషధాలు, శస్త్రచికిత్సల పరికరాలపై 12 శాతం, కొన్నింటిపై మాత్రమే 5 శాతం జిఎస్‌టి ఉండేది. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి సంస్కరణల్లో భాగంగా సెప్టెంబర్ 22వ తేదీ నుంచి మందులపై ఉన్న 12 శాతం జీఎస్టీని 5 నుంచి 7 శాతానికి, క్యాన్సర్ సహా అరుదైన వ్యాధులకు వాడే 33 రకాల మందులపై జీఎస్టీని పూర్తిగా తొలగించింది. ఈ నూతన ధరల ప్రయోజనాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచే ప్రజలకు అందించాలని జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ పేర్కొంది. కానీ మెజార్టీ దుకాణాల్లో ఈ తగ్గింపు ధరలు లభించడం లేదు. జిఎస్‌టిపై అధిక శాతం ప్రజలకు అవగాహన ఉన్న గ్రేటర్ హైదరాబాద్ నగరంలోనే నూతన సంస్కరణల ఫలాలు అందడం లేదు. ఇక రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాల్లో తెలియడం తక్కువ.. తెలిసి అడిగినా జీఎస్టీ తగ్గించే నాధుడే కరువయ్యారు.

అధికారులకు తగ్గించామని చెబుతూనే..!

జిఎస్‌టి తగ్గినందున ఆ మేరకు మందుల ధరలు తగ్గించి విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం అందించిన ఫలాలు ప్రజలకు చేరువ కావాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. ఏ దుకాణంలోనూ జీఎస్టీ తగ్గించి ఇవ్వడం లేదు. పాత, కొత్త ధరల బోర్డులు ఏర్పాటు చేయలేదు. అడిగితే మా వద్ద పాత స్టాక్ ఉందని, కొత్త స్టాక్ ధరలు తగ్గించి వస్తే ఇస్తామని దుకాణదారులు చెబుతున్నారు. ఇప్పుడు మీకు (వినియోగదారులకు) 7 శాతం తగ్గించి ఇస్తే తాము నష్టపోతామని వారు పేర్కొంటున్నారు. పాత నిల్వలైనా ప్రస్తుత తగ్గిన ధరల ప్రకారమే అమ్మాలని స్పష్టమైన ఆదేశాలు అధికారులు ఇచ్చినా అమలు కావడం లేదు. జిఎస్‌టి అధికారులతోపాటు డ్రగ్ నియంత్రణ అధికారులు నిఘా పెంచి తరచూ తనిఖీలు చేస్తేనే జిఎస్‌టి తగ్గింపు ఫలాలు ప్రజలకు అందే వీలుంది.

జిఎస్‌టి తగ్గింపు కావాలంటే డిస్కౌంట్ అడగొద్దు

చాలా దుకాణాల్లో నూతన జిఎస్‌టి సంస్కరణల ఫలాలు అందడం లేదు. ఎవరైనా అవగాహన ఉండి జిఎస్‌టి తగ్గింది కదా ధరలు తగ్గాలి కదా అని అడిగితే నీకు జీఎస్టీ తగ్గించాలంటే డిస్కౌంట్ అడగొద్దు అని చెబుతున్నారు. జీఎస్టీ 12 శాతం నుంచి 5-7 శాతానికి తగ్గింది. అంటే ఎమ్మార్పీపై 7 శాతం తగ్గుతుంది. అదే డిస్కౌంట్ అయితే ఎమ్మార్పీపై 10 శాతం వస్తుంది. మనం జిఎస్‌టి తగ్గించాలని అడిగితే డిస్కౌంట్ కోల్పోతాం. ఫలితంగా 3శాతం మనకే నష్టమని భావించి అధిక శాతం వినియోగదారులు దుకాణదారులు ఇచ్చిన బిల్లుకు మందులు తీసుకుంటున్నారు. బిల్లు కావాలని అడిగిన వారికీ ఇదే పరిస్థితి నెలకొంది. బిల్లు కావాలంటే డిస్కౌంట్ అడగొద్దని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. బిల్లు ఇస్తే ఎమ్మార్పీ 7 శాతం జీఎస్టీ తగ్గించి ఇవ్వాలి. బిల్లు లేకుండా అయితే 10 శాతం డిస్కౌంట్ ఇవ్వొచ్చు.

తొలి దశ సర్పంచ్ నామినేషన్లు 25,654

- అత్యధికంగా సూర్యపేట జిల్లాలో 1,387
- అత్యల్పంగా ములుగులో 220

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. చివరి రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు తొలిదశలో నిర్వహిచే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు ఆదివారం వెల్లడించారు. మొదటి విడుత సర్పంచ్ పదవి కోసం 25,654 నామినేషన్లు, వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి అత్యధికంగా సూర్యాపేట జిల్లాల్లో 1,387 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ జిల్లాలో రెండు రోజుల్లో 366 నామినేషన్లు దాఖలు కాగా, చివరి రోజు 1021 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత అత్యధిక నామినేషన్లు దాఖలైన రెండో జిల్లాగా వికారాబాద్ నిలిచింది. ఈ జిల్లాల్లో 262 గ్రామ పంచాయతీలకు 1,383 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత మహబూబాబాద్‌లో 155 జీపీలకు గాను 1239, ఆ తర్వాత కామారెడ్డి జిల్లాలో 167 జీపీలకు గాను 1,224 నామినేషన్లు, ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాలో 174 జీపీలకు గాను 1.169 నామినేషన్లు దాఖలయ్యాయి.

కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం

- 35 బొమ్మల దుకాణాలు దగ్ధం
- తీవ్ర ఆస్తి నష్టం.. వీధిన పడిన 35 కుటుంబాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. వరుసగా దుకాణాలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సుమారు 35 దుకాణాలు పూర్తిగా కాలిపోయి రూ.కోటి వరకు ఆస్తినష్టం వాటిల్లింది. కొండగట్టు పెద్ద హనుమాన్ విగ్రహం వద్ద నుంచి జగిత్యాల-కరీంనగర్ హైవే వరకు షాపులు దగ్ధమైనట్టు అగ్నిమాపకదళం సిబ్బంది తెలిపింది. జగిత్యాల, ధర్మపురి, కరీంనగర్ నుంచి ఒక్కొక్కటి చొప్పున మూడు ఫైర్ ఇంజిన్‌లు వచ్చి మంటలు ఆర్పాయి. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణం తెలియలేదు. కాగా బాధితులు కట్టుబట్టలతో రోడ్డుపైకి చేరారు. కండ్లముందే దుకాణాలు దగ్ధం కావడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆదివారం కొండగట్టులో పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే సత్యం భరోసా ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం తక్షణసాయంగా రూ.20వేలు ఇస్తుందని తెలిపారు.

అధికారులు సకాలంలో స్పందించలేదు : మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్థానిక బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెళ్లి బాధిత కుటుంబాలను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు సకాలంలో స్పందిస్తే ఇంత భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగేది కాదన్నారు. బాధితులు రానున్న సమ్మక్క సారక్క జాతరను పురస్కరించుకొని సుమారు మూడు నుంచి నాలుగు లక్షల వరకు సామగ్రిని కొనుగోలు చేసుకుని పెట్టుకున్నారని, ఇప్పుడు ఈ ఘటనలో సర్వం కోల్పోయారని తెలిపారు. విద్యార్థుల హాల్ టికెట్లు, విలువైన డాక్యుమెంట్లు, నగదు బంగారం కూడా మంటల్లో కాలిపోయాయని చెప్పారు. ప్రమాదంపై సమగ్ర నివేదిక తయారు చేసి ఒక్కొక్క కుటుంబానికి రూ.30లక్షల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నర్సరీ విద్యార్థిపై ఆయా కర్కశత్వం

- జీడిమెట్లలోని ప్రయివేట్ పాఠశాలలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నర్సరీ విద్యార్థిని పట్ల ప్రయివేటు పాఠశాల ఆయా అమానవీయంగా ప్రవర్తించింది. సాయంత్రం సమయంలో చిన్నారిని నేలపై విసిరేసి.. పిడిగుద్దులు గుద్దుతూ.. కాళ్లతో తంతూ తీవ్రంగా కొట్టింది. ఈ ఘటన హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో ఓ ప్రయివేట్ స్కూల్లో జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఇందుకు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. షాపూర్‌నగర్‌లోని ప్రయివేటు స్కూల్‌లో ఓ చిన్నారి నర్సరీ చదువుతోంది. పాఠశాల ముగిసిన తర్వాత చిన్నారిని ఆయా ఇష్టారీతిన కొట్టింది. చిన్నారిపై కాలు వేసి తొక్కుతూ కర్కశంగా ప్రవర్తించింది. ఆయా కొట్టినట్టు చిన్నారి చెప్పడంతో తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. బాలికను తీవ్రంగా కొట్టడంతోపాటు కాలుతో తొక్కుతున్న దృశ్యాలను పాఠశాల పక్క భవనంపై నుంచి ఓ యువకుడు వీడియో తీశాడు. అది స్థానికంగా ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో వైరల్ అయింది. ఆ వీడియో ఆధారంగా బాలిక తల్లిదండ్రులు ఆయాపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆకాశవాణి వార్షిక సంగీతోత్సవం శ్రవణపేయం

ప్రజాశక్తి - కల్చరల్

ఆకాశవాణి ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా సంగీత సమ్మేళనం నిర్వహిస్తారు. అందులో భాగంగా హైద్రాబాద్ ఆకాశవాణి కేంద్రం తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టిఆర్ కళా మందిరంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గీత రచయిత రామ జోగయ్య శాస్త్రి పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి లలిత సంగీతానికి ప్రాచుర్యం ఆకాశవాణి ద్వారా కలిగింది అన్నారు. ఇప్పటికీ ఆ సంప్రదాయానికి ప్రాధాన్యత ఇవ్వడం హర్ష దాయకం అన్నారు ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణ అధికారి రమేష్ సుంకరి స్వాగతం పలుకుతూ భారతీయ సంగీత సంప్రదాయ వేడుకలు ఢిల్లీ లో ప్రసార భారతి చైర్మన్ నవనీత్ సైగల్ నవంబర్ నెల 2 వ తేదీ ప్రారంభించగా వరుసగా రాష్ట్రాల వారి గా జరుగుతున్నాయి అని తెలిపారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భనోత్ హరి సింగ్ మాట్లాడుతూ ఎందరో ఆకాశవాణి ద్వారా నే సంగీత రంగంలో లబ్ద ప్రతిష్ట పొందారని చెప్పారు. నేటి కార్యక్రమం ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి దూర దర్శన్ ఛానెల్ నుంచి జనవరి మాసంలో ప్రసారం అవుతుంది అని తెలిపారు. అనంతరం కర్ణాటక సంగీత కళా కారుడు డివి మోహన్ కృష్ణ శ్రావ్య గళంలో త్యాగరాజ మంగళంపల్లి బాల మురళీ కృష్ణ అన్నమయ్య కీర్తనలు ఆలపించారు వయోలిన్ పై అర్ దినకర్ మదంగం పై ఎల్లా వెంకటేశ్వర రావు కెంజీర పై శ్యామ్ సహకారం అందించారు. జానపద సంగీత కార్యక్రమంలో డాక్టర్ పత్రి కుమార స్వామి డాక్టర్ అరుణ సుబ్బారావు గీతలు ఆలపించారు వేణువు పై రవి శంకర్ కీ బోర్డు పై గురు ప్రసాద్ డోలకు పై మోహన్ వాయిద్య సహకారం అందించారు.